పీలేరులో దీపావళి సందడి



పీలేరురూరల్ : పట్టణంలో దీపావళి సందడి నెలకొంది. దీపావళి సందర్భంగాద పూలు, దీపాలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు ఎగబడ్డారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు జనంతో నిండిపోయాయి. సీఐ యుగంధర్, అగ్నిమాపక అధికారి భాస్కర్‌రెడ్డి టపాకాయల దుకాణాలను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. దుకాణాల వద్ద ఇసుక, నీరు ఏర్పాటు చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు టపాకాయలు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

సంప్రదాయాలను గౌరవిద్దాం



నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్ సంప్రదాయ దుస్తుల్లో డీఎస్పీ మహేంద్ర, సీఐ సత్యనారాయణ తదితరులు

నిమ్మనపల్లె : నిత్యం ఖాకీ దుస్తులో కనిపించే పోలీస్ బాసులు ఆదివారం సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పోలీసులు విధుల్లో భాగంగా ఉపయోగించే వాహనాలు, ఆయుధాలకు పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, రూరల్ సీఐ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పోలీస్ సిబ్బందికి టపాసులు, స్వీట్స్ అందజేశారు. మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని, ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు పర్యవేక్షించాలని, ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీపావళి సందర్భంగా పోలీస్‌స్టేషన్ విద్యుత్ దీపాల అలంకరణతో చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ట్రైనీ ఎస్ఐ శ్రీప్రియ, ఏఎస్ఐ జిలానీబాషా, హెడ్‌కానిస్టేబుల్ రమణ, వేణు, రామమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1.70 లక్షల విరాళం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ అన్నదాన ట్రస్టుకు బెంగళూరు చిక్కలసంద్రకు చెందిన ఎం.రవికుమార్ ,ప్రసన్నకుమార్‌లు రూ.170 లక్షలు విరాళం అందజేశారు. ఆదివారం మల్లయ్యకొండను వారు సందర్శించారు. అనంతరం అన్నదానట్రస్టు సభ్యులకు విరాళాన్ని అందజేశారు.

గోరంత డీఏ.. కొండంత ప్రచారం

మదనపల్లె సిటీ: ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన డీఏ గోరంతేనని దీనిని కొండంత ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు మునిగోటి శ్రీనివాసశర్మ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కంటి తుడుపుగా ఒక డీఏ మాత్రం ఇచ్చారని అది కూడా 18 నెలలు తరవాత ప్రకటించడం విచారకరమన్నారు. డీఏ బదులు పీఆర్సీ ప్రకటంచి ఉంటే బాగుండేదన్నారు.

ఎంపీపీ మృతికి సంతాపం

రామసముద్రం: మండల వైఎస్సార్ సీపీ ఎంపీపీ కుసుమ కుమారి(70) ఆదివారం మృతి చెందింది. శనివారం గుండెపోటు రావడంతో కుటుంబికులు మదనపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఇంటిలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్ ముబిషిర్ అహ్మద్, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ జింకా వెంకటా చలపతి సంతాపం తెలిపారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు.

























